కథ

# బాధ్యత

ఎం.వెంకటేశ్వరరావు

"భూమ్మీద పుట్టిన ప్రతి మనిషికి కొన్ని కుటుంబ బాధ్యతలు, కొన్ని సామాజిక బాధ్యతలుంటాయి. సామాజిక బాధ్యతల్ని పరిపూర్తిగా నెరవేర్చలేకపోయినా....కుటుంబ బాధ్యతల్ని సక్రమంగా నెరవేర్చడంలో అలసత్వం చూపిస్తే...కుటుంబం కుంటుపడుతుంది. సమస్యలు చుట్టుముడతాయి. మనఃశ్శాంతి మన దగ్గరికి రావడానికి భయపడుతుంది. బాగా ఆలోచించి చూడు. నువ్వు నెరవేర్చాల్సిన 'బాధ్యత' ఏమిటో నీకే అవగతమవుతుంది'' అన్నాడు అంతా విన్న భాస్కరం మామయ్య.

సుబ్బులు బాబాయి రెండో కొడుకు పెళ్లికి బందరొచ్చాను. అప్పుడు, సన్నిహితుడు...భాస్కరం మామయ్యని చూడగానే...మనసులో మంచులా ఘనీభవించిన వేదన కరగడం మొదలుపెట్టింది. స్నానాదులు ముగించుకొని, ఇద్దరం మంగినపూడి బీచ్‌కి వచ్చాం.

ఎగిసిపడే కడలి తరంగాలు తీరం చేరుకున్నట్టు మదిని మెలిపెడుతున్న బాధ...భాస్కరం మామయ్య ముందుంచేసరికి అంతా విని,



మామయ్య అన్న మాటలివి.

భాస్కరం మామయ్య ఇన్‌డైరక్టుగా తెలియజెప్పిన 'బాధ్యత' ఏమిటో నాకు తెల్సినా, మనసెందుకో ఆ క్షణం నుంచి తేలికపడ్డట్టు అన్పించింది. మామయ్యకి, నాకూ ఆరేళ్లే వయస్సు వ్యత్యాసం. ఇదే సముద్రం సాక్షిగా... మా ఇద్దరి జీవితాల్లో జరిగిన, ఎన్నో ముఖ్య నిర్ణయాలు, మనఃక్లేశాన్ని కల్గించిన సంఘటనలకి ఉపశమనాలు దొరికాయిక్కడ. మా ఇద్దరి అనుబంధ, ఆప్యాయతలకి, సంతోష, దుఃఖాలకి ఈ సముద్రపు ఘోష మాతో పాటు పాలు పంచుకుంటూ, మా ఆత్మీయతకు ఆనవాలుగా అప్పటికీ, ఇప్పటికీ....ఎప్పటికీ....

బందరులో పెళ్లి అవగానే బయల్దేరి...మర్నాడుదయం హైదరాబాదొచ్చాను. రాత్రి బస్సులో మనసుని తొలుస్తున్న ఆలోచనలు నా లోచనాలకు విశ్రాంతినివ్వలేదు.

''ఎందుకో తెలీటం లేదు గానీ...కొన్ని రోజులుగా నా మనస్సులోనూ, ఇంట్లోనూ నెమ్మది లేకుండా పోయింది. నా కొడుకు శ్రీధర్ ఎంసిఏ చదివాడు. క్యాంపస్ ఇంటర్వ్యూలో టిసిఎస్ ఉద్యోగం వచ్చి సంవత్సరం దాటుతున్నా అప్పాయింట్‌మెంటు ఆర్డరు చేతికి రాలేదు. సాఫ్ట్‌వేర్ బూమ్ పడిపోయిందంటున్నారు. ఎప్పుడు వాడి

కుద్యోగం వస్తుందో అర్థం గాని పరిస్థితి, కూతురు శిరీషకి ఆశించిన కాలేజీలో, కావాలనుకున్న బ్రాంచిలో ఇంజనీరింగ్ సీటు దొరకలేదు. భార్య పద్మకి ఈ మధ్యనే యుటెరస్ రిమూవల్ ఆపరేషన్ జరగడం ఒకదాని వెంట మరొకటి ఇంటి సమస్యల ప్రభావం నేను పన్జేస్తున్న ఉద్యోగంపై చూపడం వల్ల...అక్కడా ప్రతి రోజూ చికాకులు.

సాయంత్రం ఆఫీసు నుంచి ఇంటికి రాగానే....కాఫీ ఇచ్చి, ''ఏంటండీ! అదోలా ఉన్నారు?'' అంది పద్మ.

''నాన్న....''

''పెళ్లిలో ఎవరైనా....ఏమైనా అన్నారా?''

భాస్కరం మామయ్య అన్న మాటలు చెప్పాను.

పద్మ మౌనంగా కాఫీ గ్లాసు తీసుకుని లోపలకెళ్లింది.

నాన్న...నాన్న గుర్తు రాగానే....కళ్లల్లో తడి. 'ఇల్లొదిలి వెళ్లి వారం రోజులవుతోంది. ఎక్కడ ఉన్నాడో! ఏం తింటున్నాడో..' మనసు మూల్గింది. పడక్కుర్చీలో వెనక్కి వాలి కళ్లు మూసుకున్నాను.

నేను నోరు జారి ఉండాల్సింది కాదేమో. ఎంతో సహనం, ఓర్పు ఉన్న నాన్న నా చిన్న మాటని అంత సీరియస్‌గా పట్టించుకొని ఇల్లొదిలి వెళతాడనుకోలేదు. ఇలా ఎన్నడూ జరగనూ లేదు.

ఒంటికాయ శొంఠి కొమ్ములా....నాన్నకి నేను, నాకు నాన్న తప్ప తోబుట్టువెవ్వరూ లేరు. ఊహ తెలియక ముందే 'అమ్మ' నన్నొదిలి వెళ్లినా, నాన్న అమ్మ స్థానం మరెవ్వరికి ధారాదత్తం చెయ్యకుండా ఇద్దరూ తనే అయి నన్ను దొరబాబులా పెంచి, పెద్ద జేసి, పెళ్లి చేశాడు. తను ఉద్యోగం చేసుకుంటూ, నాకే లోటు రాకుండా చూసుకునేవాడు.

ఎటొచ్చి పెళ్లయ్యాకే మా అనుబంధానికి హెయిర్‌లైన్ ఫ్రాక్చర్ మొదలైంది. ఆడ దిక్కు లేకుండా...పాతికేళ్ల వంట వార్పులతో విసుగెత్తిన మాకు, ఇంటి పట్టున ఉండే అమ్మాయి నాకు భార్యగా వస్తే....అనే ఆలోచనను అమలు చేశాం. దూరపు బంధువుల అమ్మాయి 'పద్మ' నాకు అర్థాంగి కాగల్గింది కానీ....మా ఇద్దరి మనోభావాల్ని అర్థం చేసుకునే మనఃపక్వత ఆమెకి లేదని పెళ్లయిన తొలిరోజుల్లోనే అర్థమయింది. నాన్నకి పెన్షన్ వచ్చేది. ఇంటికి కావల్సినవన్నీ తనే చేస్తూ, ఉద్యోగం వెలగబెట్టే నాతో చిన్న పని కూడా చేయనిచ్చే వాడు కాదు. పిల్లల్ని స్కూల్లో దించడం, సరుకులు, కూరలు, కరెంటు బిల్లులు మొదలు ఇంటర్నెట్ బిల్లుల వరకు....ఒకటేమిటి సమస్తం తనే చూసుకునేవాడు.

అయినా పద్మలో అశాంతి. కాలంతో కరచాలనం చేస్తూ మమ్మల్ని కనిపెట్టుకుని ఉంటున్న నాన్నలో కావాలని లోపాలు వెదుకుతుండేది. నేనూ, నాన్న పట్టించుకునే వాళ్లం గాకపోబట్టి...ఇరవై యేళ్లు ఇట్టే గడిచిపోయాయి. నేనూ ఫార్టీ ఫైవ్ ప్లస్ కొచ్చేశాను. ఈ మధ్య పద్మలో ఒక విధమైన శాడిజం చోటు చేసుకుంటోంది. అదీ నాన్న మీదే. ఆయన ఏ పని చెయ్యొచ్చినా..వయసు వ్యత్యాసం మరిచి మరీ విరుచుకు పడుతోంది. ఎంత సర్దుకు పోతున్నా....అయిన దానికీ కానిదానికి ఆయన్ని కారణంగా చూపి పిల్లల ముందు సూటిగా గుచ్చుకుపోయే మాటలు అంటుంటే...నేనే తట్టుకోలేకపోయేవాణ్ణి. ఇహ అరవై ఐదు దాటిన నాన్న సంగతి వేరే చెప్పాలా? పద్మ మోనోపాజ్ ప్రభావం వల్ల అలా ప్రవర్తిస్తోందేమోనని నాన్నకి సర్ది చెప్పేవాణ్ణి.

ఆఫీసులో ఆడిటింగ్ జరుగుతోంది. ఆ రోజు రాత్రి అలిసిపోయి ఇంటికొచ్చేసరికి....ఇంట్లో పద్మ, నాన్నల మధ్య వాగ్యుద్ధం జరుగుతోంది. నన్ను చూసి ''చూడండి....మీ నాన్నా...'' అంటూ ఏదో చెప్పబోయిన పద్మని కసురుకున్నాను.

''అది కాదురా....'' అని నాన్న ఏదో చెప్పాస్తుంటే..

మళ్లీ పద్మ నాన్నతో వాదులాట మొదలుపెట్టింది. నా చేయి వేగంగా పద్మ చెంప ఛెళ్లమనిపించింది.

''ఇప్పుడు చల్లబడ్డాయా....కళ్లు'' ముక్కు చీదుతూ, నాన్న వైపు ఉక్రోషంగా చూసింది పద్మ. ఇంట్లోనే ఉన్న శ్రీధర్, శిరీష బిత్తరపోయి చూస్తుంటే నాకే సిగ్గనిపించింది. ఈ వయసులో భార్య మీద అదీ పిల్లల ముందు చెయ్యి చేసుకోవడం మగతనమా?!

మ్రాన్పడినట్లు నన్నే చూస్తూ కన్నీళ్లతో లోపలికెళ్లింది పద్మ.

మౌనంగా ఎటో చూస్తూ...బాల్కనీలో కూచున్న నాన్నతో ఆవేశంగా.. ''ఏమిటి నాన్నా ఇది? ఇంటికి రావాలంటేనే....నరకంగా ఉంది. రాన్రానూ, ఎన్నాళ్లని అంటి పెట్టుకుని కూచుంటావు. కొన్నాళ్లపాటు...ఏ బంధువులిళ్లకో, తీర్థయాత్రలకో వెళ్ళి రారాదూ...నీకూ కొంత మనశ్శాంతి, మాకు కొంత ప్రశాంతత ఉంటుంది.'' అని నోరు జారాను.

అంతే....నా మాటలు విని నిర్ఘాంతపోయినట్లు నావైపు చూశాడు నాన్న. అలా ఆయన నా వైపు చూడడం జీవితంలో అదే మొదటిసారీ...చివరిసారీ అవుతుందని తెలిస్తే....అలా అనుండేవాణ్ణి కాదు.

మర్నాడు ఆడిటింగ్ ఉంది గాబట్టి....నేను ఎప్పటి కంటే రెండు గంటలు ముందే ఆఫీసుకెళ్లాను. సాయంత్రం ఏడున్నర గంటలకి పద్మ నా సెల్‌కి ఫోన్ చేసి ''ఏమండీ! మామయ్యగారు....ఉదయం మీరు ఆఫీసుకెళ్లగానే బయటకు వెళ్లి ఇప్పటి వరకూ రాలేదు. మీ దగ్గరికేమైనా వచ్చారా?'' అంది.

అంతే!.... నా వెన్నులో వణుకు ప్రారంభమయింది.

వెంటనే నాన్న సెల్‌కి కాంటాక్ట్ చేశాను. స్విచ్ ఆఫ్ అని వినిపిస్తోంది. వెంటనే ఇల్లు చేరాను. నేనూ, శ్రీధర్ బైక్ మీద నాన్న వెళ్లే ప్రదేశాలన్నీ వెతికి వచ్చాం. కనిపించలేదు. రాత్రి పన్నెండయింది. బంధువులందరికీ ఫోన్లు చేశాను. ఫలితం లేదు.

నాకు ఊహ తెలిసింతర్వాత నాన్న నన్నొదిలి వెళ్లడం....ఇదే ప్రథమం. చిన్నప్పట్నుంచీ బంధువులిళ్లలో పెళ్లిళ్లకి,ప్రస్తావనలకీ ఇద్దరం కలిసి వెళ్లే వాళ్లం. నేను స్కూల్లో చదివే రోజుల్లో ఎక్స్‌కర్షన్‌కు వెళ్లినా....తనూ వచ్చేవాడు.


''ఇదంతా నీ వల్లే...'' అంటూ పద్మ మీద నా అసహనాన్ని ప్రదర్శించాను. పిచ్చితనంగా అనిపించింది. మర్నాడు ఆఫీసుకెళ్లి లీవు పెడదామంటే..... ఆడిటింగ్ వల్ల వీలుపడలేదు. ఆఫీసులో యాంత్రికంగా పన్జేస్తున్నా కానీ మనసు మనసులో లేదు. సాయంత్రం ఇంటికి వస్తూ....నాన్న, నేను తరచూ వెళ్లే మారుతీ గుడికి వెళ్లాను. అక్కడ పూజారి.....'' ఏమయ్యా! ఏంటీవేళ ఒక్కడివే వచ్చావు. మీ నాన్న గారెక్కడ?'' అనడిగాడు.

విషయం చెప్పాను.

''ఆ మధ్య....మీ నాన్న భీమ్లీ దగ్గర ఏదో ఆశ్రమం ఉందని దాన్ని గురించి ఎవర్తోనో చెబుతుంటే విన్నాను. ఒకవేళ అక్కడికేమైనా వెళ్లుండచ్చేమో!'' అనేసరికి,

అప్పటికప్పుడే మొబైల్ తీసుకొని, భీమ్లీ ఆంధ్రా బ్యాంకులో పనిచేస్తున్న క్లాస్‌మేట్ కృష్ణారావుని కాంటాక్ట్ చేశాను. తెలుసుకొని చెప్తానన్నాడు.

మూడ్రోజులైంది. కృష్ణారావుకి ముప్ఫయి సార్లు ఫోన్ చేసుంటాను. రెండు, మూడు వృద్ధాశ్రమాలకి వెళ్లి చూసొచ్చానని, అక్కడ నాన్న లేడని చెప్పడంతో నిరాశ నన్ను మరింత కృంగదీసింది.



## 'ఆనందతాండవం'పై తమన్నా ఆశలు....

'కొంచెం ఇష్టం-కొంచెం కష్టం' తమన్నాకు కొద్దిగా నిరాశనే మిగిల్చింది. తాజాగా ఉగాది కానుకగా విడుదల కాబోతున్న 'ఆనందతాండవం'పై తమన్న బోలెడు ఆశలు పెట్టుకుంది. సిద్ధార్థ, తమన్నా కలిసి నటించిన ఈ సినిమా ఈ నెల 27న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. సినిమా ఆడియో ఈ నెల 13న రిలీజ్ కాబోతోంది. దర్శకుడు గాంధి కృష్ణ మాట్లాడుతూ, ప్రేమకథాంశంతో రూపొందిన ఈ చిత్రం సిద్ధార్థకి, తమన్నాకి మంచి పేరు తీసుకొస్తుందని అన్నారు. తెలుగు ప్రేక్షకులకు ఉగాది సందర్భంగా నిజమైన ప్రేమకథను అందిస్తున్నామని చెప్పారు.

నాలుగు రోజులు నాన్నని చూడకుండా ఎప్పుడూ ఉండలేదు.

ఈ లోపల....బాబాయ్ కొడుకు పెళ్లి రావడం, ఒక వేళ నాన్న అక్కడికేమైనా వస్తాడేమోనని ఆశ ఓ పక్క, భాస్కరం మామయ్యతో మనసులో భారం పంచుకోవాలని మరో పక్క బలంగా మనసులో మెదలడంతో....వెంటనే పెళ్లికి బయల్దేరాను.

పెళ్లికెళ్లొచ్చిన మర్నాడుదయం మళ్లీ ప్రయాణం అవుతుంటే....''మళ్లీ ఎక్కడికి?'' అని అడిగింది పద్మ.

''భీమ్లీ''

''అక్కడెవరున్నారు?''

''మా నాన్న...''

''ఎవరు చెప్పారు?''

''వచ్చి చెప్తా....'' అని మరో మాటకి ఆస్కారమివ్వకుండా బయల్దేరాను.

***

భీమ్లీ చేరుకుని......కృష్ణారావుని కల్సుకుని వృద్ధాశ్రమాల గురించిన వివరాలు తెలుసుకుని....అక్కడికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆనందపురానికి సమీపంలో ఉన్న వృద్ధాశ్రమానికి చేరుకునేసరికి మధ్యాహ్నమయింది. చల్లని స్వచ్ఛమైన గాలి, ఎటు చూసినా పచ్చని పొలాల మధ్య ఊరిచివరన ఉందా ఆశ్రమం

అక్కడ మామిడిచెట్లు, కొబ్బరిచెట్లు, అరటిచెట్ల మధ్య చల్లదనంతో ప్రశాంతత అంతా అక్కడే ఆవాసం చేస్తున్నట్లనిపించింది. ఆశ్రమ నిర్వహణాధికారి రామచంద్ర గారిని కలిసి, నాన్నను గురించిన వివరాలు చెప్పి అడగ్గా....నాల్గు రోజుల క్రితమే ఆశ్రమంలో చేరినట్లు చెప్పాడు. అప్పటి వరకూ మనసులో పేరుకున్న ఉద్వేగం....అశ్రురూపంలో బయటకొచ్చి భారాన్ని దింపింది. ఆయనకి కనిపించకుండా కళ్లు తుడుచుకుని, ''మా నాన్నెక్కడ?'' అన్నాను జీరబోయిన గొంతుతో.

''ఇక్కడ ఆశ్రమంలో ఉన్న వాళ్లలో మానసిక చైతన్యాన్ని కల్గించి వాళ్లని ఒంటరితనం వెంబడించకూడదని, బంధుత్వాలతో పాటు బాహ్య ప్రపంచపు బంధాలు తెగిపోయాయన్న బాధ వాళ్లలో కలగకుండా ఉండాలన్న ఉద్దేశ్యంతో వారానికి రెండు రోజులు సమీపంలో ఉన్న గుళ్లు, గోపురాలకి, విహార స్థలాలకి పంపిస్తాము. అందుకు బస్సు, భోజన వైద్య వసతులు పకడ్బందీగా ఏర్పాటు చేస్తాము. ఈసారి అన్నవరం వెళ్లారు. వెళ్లేటప్పుడు వృద్ధులంతా నవ్వుతూ, తుళ్లుతూ వెళుతుంటే వాళ్ల మొహాలలో కనిపించే ఆనందపు అందాలని చూస్తుంటే....మళ్లీ వాళ్లు బాల్యంలోకి పరకాయ ప్రవేశం చేసినట్టుంటుంది.'' అన్నాడాయన.

''ఎప్పుడు తిరిగి వస్తారు?''

''రెండు రోజులు పడుతుంది.''

నేను మర్నాడు ఆఫీసుకి అర్జంటుగా వెళ్లాల్సి ఉండడంతో డబ్బున్న కవరు రామచంద్రగారికి ఇచ్చి, ''నేను మళ్లీ వచ్చి నాన్నని తీసుకెళతానని చెప్పండి'' అన్నాను.

''మీ దగ్గరే ఉండాలని ఆయనకు ఉంటే ఇక్కడదాకా వచ్చేవారు కాదేమో! సన్యాసం తీసుకున్నాక కూడా కొడుకుగా తల్లిదండ్రుల బాధ్యతలు నిర్వర్తించిన యోగిపుంగవులు ఎందరో ఉన్నారు. ఈకాలపు పిల్లలు వృద్ధాప్యంలో తల్లిదండ్రుల్ని ఎలా చూసుకోవాలో తెలుసుకోవాలంటే, మళ్లీ వాళ్లొకసారి జన్మించి జ్ఞానబోధ చెయ్యాలి'' అని మెల్లగా, మృదువుగానే చెప్పినా ముల్లుతో గుచ్చినట్లనిపించింది.

***

నాన్నకీ, నాకు ఉన్న అనుబంధం తెలియక ఆయన అలా అన్నాడనుకొని మనసుకి సర్దిచెప్పుకున్నాను.

వారం రోజులు గడిచినా....నాన్న నుంచి గానీ, రామచంద్రగార్నించి గానీ ఫోన్ లేదు. నేను నాలుగు సార్లు ప్రయత్నించినా బదులు లేదు.

ఆరోజు ఆఫీసులో బిజీగా ఉన్న సమయంలో శ్రీధర్ ఫోన్ చేసి తనకి చెన్నైలో జాయినవమని అపాయింట్‌మెంట్ ఆర్డరు వచ్చిందని చెప్పాడు. అంత బిజీలోనూ కొంత భారం తగ్గినట్లనిపించింది. సాయంత్రం ఇల్లు చేరేసరికి శిరీష తనకి మాతృశ్రీ ఇంజనీరింగ్ కాలేజీలో కంప్యూటర్ సైన్సులో సీటు వచ్చిందని చెప్పడంతో మనసులో ఉన్న భారం మాయమైనట్టనిపించింది. ఆ సంతోషాన్ని పంచుకునే నాన్నలేని పెను భారం మాత్రమే మనస్సు నుంచి బయటకు రానని మొండికేస్తోంది.

నాన్నకీ విషయాలు చెబుదామని ఫోన్ చేశాను. పదిహేను రోజులుగా విన్పిస్తున్న మాటే స్విచ్డ్ఆఫ్. రామచంద్రగారి కోసం ఆశ్రమానికి ఫోన్ చేసాను.

''ఆయన బయటకెళ్లారండి'' అన్నారెవరో ఫోన్ లిఫ్ట్ చేసి.



''కొంచెం కృష్ణమూర్తిగారిని పిలుస్తారా?''

''ముగ్గురు కృష్ణమూర్తులున్నారు. మీకు ఏ కృష్ణ మూర్తి కావాలి?''

''ఎస్. కృష్ణమూర్తిగారని కొత్తగా జేరారు.''

''ఆయనా!....రామచంద్రగారితో కలిసి ఆనంద పురం వెళ్లారు'' అని ఫోన్ పెట్టేశాడు.

మళ్లీ నాన్న సెల్‌కి ఫోన్ చేశాను. బదులు లేదు. చిరాకుగా ''ఏంటీ వయసులో ఈయనకి ఇంత పట్టుదల'' అని పైకే అనేశాను. నా పక్కన నిలబడ్డ పద్మ నా మాటలు విని, ''ఉండనివ్వండి....ఎన్నాళ్లుంటారో. ఇల్లన్న తర్వాత మాటా మాటా రాకుండా ఉంటుందా? వయసుడిగిన ఆయనకే అంత పంతం ఏమిటి? ఎన్నాళ్లో చూద్దాం? మీకు వీలున్నపుడు వెళ్లి చూసిరండి'' అంది.

***

శ్రీధర్‌ని చెన్నైలో జాయిన్ చేసి రావడం, శిరీషని కాలేజీలో చేర్చడంతో మరో రెండు వారాలు నాన్న దగ్గరకి వెళ్లే వీలు పడలేదు. ఆశ్రమానికి నాన్న పేరుతో కొంత డబ్బు పంపాను. డబ్బందగానే కృతజ్ఞతలు తెలుపుతూ రామచంద్రం గారు లెటరు రాశారు.

***

నాన్న దగ్గరకి బయల్దేరబోయే ముందు రోజు రాత్రి ఆశ్రమానికి ఫోన్ చేసి ఎస్.కృష్ణమూర్తిగారిని పిలవమన్నాను.

''......''

''ఈ మధ్యనే కొత్తగా చేరారాయన'' అని వివరాలు చెప్పాను.

''ఆయన..ఆయన....చనిపోయి పదిహేనురోజులవుతోందండి'' అన్నాడు ఫోనెత్తిన వ్యక్తి. వళ్లంతా చమటలు పట్టి, కుండలతో తల మీద నీళ్లు కుమ్మరిస్తున్నట్లనిపించింది.

''మీరు......మీరు....చెప్తున్నది నిజమేనా?'' అన్నాను వణికే కంఠంతో.

''అవును సార్''

''అంతే! భూమి బద్దలవుతున్నట్లు, కాళ్ల కిందున్న భూమి పాతాళంలోకి జారిపోతున్నట్లు అనిపించి నిర్వీర్యంగా కూలబడ్డాను. ఆరాత్రే బస్సులో బయల్దేరాను.

***

ఉదయాన్నే ఆశ్రమంలో అడుగుపెడుతుంటే గుండెల్లో దడ, కాళ్లు చేతులు వణకసాగాయి. ఒక వేళ ఫోన్‌లో మాట్లాడిన వ్యక్తికి తెలియక తప్పుగా సమాచారం ఇచ్చాడని అనుకుంటూ లోపలకెళ్లాను.

రామచంద్రగారు నన్ను చూసి ''రండి! రాత్రే ఊర్నుంచి వచ్చాను'' అన్నారు నడుస్తూ.

''మా నాన్న...మా నాన్న...పోయారా?'' అన్నాను ఆవేశంగా.

''అవును. పదిహేనురోజులయింది'' అన్నారాయన కూల్‌గా.

''నాకు తెలపాల్సిన కనీసపు కర్టసీ మీకు లేదా?'' అంటూ గొంతు పెంచి నేను మాట్లాడుతుంటే, మౌనంగా నన్నాగమన్నట్లు సైగ చేసి గోడ వైపు చూపించారు. గోడ మీదున్న పది ఫోటోలతో పాటు నాన్న ఫోటోకి దండ వేసి ఉంది. నాన్నని అలా చూసే సరికి నా కళ్లలో కన్నీటి వరద సునామీలా తరుమకొచ్చింది.

''ఇక్కడ మరణించిన వాళ్లకి ప్రతి రోజూ అంజలి ఘటించడం, వారు మరణించిన రోజున పూజలు చేయించి అన్నదానం చేయడం ఆశ్రమ సాంప్రదాయం.''

ఆయన మాటలు విన్న నాకు కోపం తారాస్థాయికి చేరుకుంది.

''మీరు చేసింది కరెక్టేనా? కన్నకొడుక్కి తండ్రి మరణవార్త తెలియజేయాలన్న 'బాధ్యత' మీకు లేదా?''

మౌనంగా బీరువా తెరిచి అందులో ఉన్న ఓ లెటర్ తీసి నాకిచ్చి, ''ఇది మీ నాన్నగారు రాసింది. మీ కందజేయమన్నారు'' అన్నారాయన.

ఆత్రంగా లెటర్ తీశాను. అవును....నాన్న చేతి రాతే. కళ్లల్లో నీళ్లు సుడులు తిరుగుతున్నాయి. అక్షరాలు మసకగా కన్పిస్తుంటే కళ్లు తుడుచుకుని చదవసాగాను.

''రాజశేఖరాన్ని ఆశీర్వదించి రాస్తున్నాను ఈ ఆశ్రమ నిర్వహణాధికారి రామచంద్రగారు నా బలవంతం మీదే నేను మరణించిన సంగతి నీకు తెలియపర్చలేదు. నీకు తండ్రిగా, తల్లిగా రెండూ నేనే అయి నా బాధ్యత నేను పూర్తిచేసాను. నేను ఏనాడూ నీ సంపాదన ఆశించలేదు. అందులో జీవించనూ లేదు. ఇల్లు నీ పేరుతోనే కొన్నాను.ఇన్నేళ్లూ నా పెన్షన్ కూడా కుటుంబానికే ఖర్చుపెట్టాను. నువ్వు నన్నేదో అన్నావని, నిన్ను సాధిద్దామని నేనిక్కడకు రాలేదు. కడివెడు పాలు విషమవడానికి ఒక్క విషపు చుక్క చాలు. ఆ క్షణాన నా మనస్సు చివుక్కుమంది. నువ్వు తప్ప నాకెవ్వరున్నారని, నువ్వు కాకపోతే నన్నెవరంటారు? కాని నువ్వే నన్ను వెళ్లిపొమ్మంటే నేనెక్కడకు వెళ్లాలి? మీ అమ్మ నీకు ఊహ తెలియక ముందే చనిపోయింది. అప్పుడు నేను స్వార్థం చూసుకునుంటే...?! ఇవప్పుడవన్నీ వద్దు. కని పెంచి పెద్ద చేశాను. కనుక డబ్బు పంపి పరిహారం చేసుకున్నట్లు చేతులు దులుపుకోవడం నీ బాధ్యత అనిపించుకోదు. నేను పోయాక నా పెన్షన్ ఆగిపోతుంది. చివరి రోజుల్లో ఈ ఆశ్రమం నన్నాదరించి, నాకెంతో మనశ్శాంతినిచ్చింది. అందుకోసం ఏదైనా చేయాలి. ఎదురు చూడని విధంగా నువ్వు డబ్బులు పంపుతున్నావు. ఆ డబ్బు ఇక్కడున్న వృద్ధులకెంతో ఉపయోగపడుతుంది. నేను మరణించిన తరువాత నువ్వు డబ్బు పంపడం నిలిపివేస్తావని నాకు తెలుసు. అందుకే నా మరణం తర్వాత కూడా కొడుకుగా నువ్వు నిర్వర్తించే అసలైన ఈ 'బాధ్యత' కొంతమంది నిస్సహాయులకైనా ఆసరా అందించాలని, ఆ పుణ్యం నీకు దక్కాలని నేనే రామచంద్రగారి దగ్గర నా మరణ వార్త నీకు తెలపొద్దని ప్రమాణం చేయించుకున్నాను. ఈ బాధ్యత నీకు భారం కాకుంటేనే నిర్వర్తించు. మీ అందరికి నా ఆశీస్సులు ఎప్పుడూ ఉంటాయి....''

ఇట్లు

మీనాన్న

ఉత్తరం చదివి అక్కడే ఉన్న స్తంభానికి ఆనుకుని కూలబడ్డాను. ఎదురుగా గోడకున్న ఫోటోలో నుంచి నాన్న దిగొచ్చి వర్షిస్తున్న నా కళ్లు తుడుస్తున్నట్టన్పించింది.

***

మరుసటి నెల ఆశ్రమానికి పంపిన చెక్ అందినట్లు, ''మీ నాన్నగారి మరియు ఆశ్రమవాసుల ఆశీస్సులు మీకు, మీ కుటుంబానికి ఎల్లప్పుడూ ఉంటాయి'' అని రామచంద్రగారు రాసిన వ్యాఖ్యలు చూసి కళ్లు చెమ్మగిల్లాయి.

*


చిరునామా
ఎం.వెంకటేశ్వరరావు,
'రామ్ చరణ్'
బి-19/304, సాయి శ్రీనివాస నివాస్,
ఎంఇఎస్ కాలనీ, అల్వాల్,
సికింద్రాబాద్-15. సెల్: 9441704388